www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 11 అక్టోబర్ 2025
5
ఏలూరు



నూతన టీచర్లు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మెగా డిఎస్‌సి-2025 ద్వారా నూతనంగా నియమితులైన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు తమ వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలని జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి రెడ్డి రామారావు అన్నారు. మండల పరిధిలోని గత ఎనిమిది రోజులుగా నూతనంగా నియమితులైన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, టిజిటి, ఎస్‌జిటిలకు ఎస్‌ఇఆర్‌టి రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధనా మండలి కరిక్యులమ్ డైజైనర్ డాక్టర్ రావి అరుణ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులను నిర్వహించారు. శిక్షణా తరగతులకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి దాదాపు 250 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఇఆర్‌టి అధ్యాపకులు ఎం.రవీంద్రప్రసాద్, జి.విజయ్‌కుమార్, శ్రీమన్నారాయణ, ఆగిరిపల్లి ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్, ముసునూరు ఎంఇఒ-2 బివిఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు .. అగ్రిమెంట్లు రాసేనా..!



'గడిచిన ఏడాది పలు కంపెనీలు అందించిన మొక్కజొన్న సీడ్స్‌తో నూజివీడు మండలం గొల్లపల్లి, మోర్సపూడి, రావిచర్ల, నూజివీడు టౌన్‌తోపాటు ముసునూరు మండలంలోనూ 200 మందికిపైగా రైతులు నష్టపోయారు. పలు మొక్కజొన్న కంపెనీలు ఇచ్చిన నాణ్యతలేని సీడ్స్‌తో దిగుబడి రాక రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. అగ్రిమెంట్లు లేకపోవడంతో రైతులకు నష్టపరిహారం ఇచ్చేందుకు కంపెనీలు ససేమీరా అన్నాయి. దీంతో సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేయగా రూ.70 లక్షలు రైతులకు నష్టపరిహారంగా ఇప్పించిన పరిస్థితి నెలకొంది. అగ్రిమెంట్లు రాయకుండా సీడ్స్ కంపెనీలు పెద్ద ఎత్తున మోసం చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది.'

'ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం, హనుమాన్‌గూడెం వంటి గ్రామాల్లో రైతుల నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసిన కంపెనీ ఆర్గనైజర్లు సొమ్ములు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. దీంతో సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేయగా కొద్ది మంది రైతులకు సొమ్ములు అందాయి. ఇప్పటికీ చాలా మంది రైతులకు పంట సొమ్ములు అందని పరిస్థితి నెలకొంది. అగ్రిమెంట్లు లేకపోవడంతో కంపెనీలు చేస్తున్న మోసాలకు ఇది ప్రత్యక్ష నిదర్శనం.'

'మొక్కజొన్న కంపెనీల మోసాలు జిల్లాలో ఏటా పెరిగిపోతున్నాయి. నాసిరకం సీడ్స్‌తో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. పంట తీసుకున్నాక సొమ్ములు ఇవ్వడం లేదు. సీడ్స్ అందించే కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ఆగస్టు 18న జరిగిన డిఆర్‌సి సమావేశంలో దెందులూరు, పోలవరం ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, చిర్రి బాలరాజు గళం విప్పిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మొక్కజొన్న కంపెనీలు అగ్రిమెంట్లు రాసేవిధంగా చర్యలు తీసుకోవాలంటూ వ్యవసాయ శాఖ అధికారులకు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు జారీ చేయడం జరిగింది.'

మొక్కజొన్న సాగుకు రైతులు సన్నాహాలు

సీడ్స్ అందించే పనిలో కంపెనీలు బిజీబిజీ

రైతులకు అగ్రిమెంట్లు రాసేవిధంగా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకునేనా

ఆగస్టు18న డిఆర్‌సి సమావేశంలో మొక్కజొన్న కంపెనీల తీరుపై ఎంఎల్‌ఎల గళం

అగ్రిమెంట్ల అమలుపై అధికారులకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశం



మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొక్కజొన్న సాగుకు జిల్లా రైతాంగం సన్నద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా లక్షకుపైగా పైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు సాగనుంది. అతిపెద్దసాగుగా ఉన్న మొక్కజొన్న పంటపై వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కజొన్న సాగులో రెండు రకాల సాగు పద్ధతులను రైతులు అవలంబిస్తున్నారు. ఒకటి వాణిజ్య (కమర్షియల్) సాగు కాగా, రెండోది కంపెనీలు సీడ్స్‌తో చేసే సాగు. కమర్షియల్ సాగులో వచ్చే పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. సీడ్స్ సాగుకు సంబంధించి అంతా కంపెనీల కనుసన్నల్లోనే సాగుతోంది. ఇదే అదునుగా మొక్కజొన్న సీడ్స్ కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయి. మొక్కజొన్న సాగు అక్టోబర్‌లో ప్రారంభించి నవంబర్ రెండో వారం వరకూ రైతులు విత్తనాలు నాటుతారు. కొన్ని కంపెనీలు రైతులను మోసం చేసి డిసెంబర్‌లో సాగు చేయిస్తున్నారు. నాలుగు టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీలు చెప్పి రైతులకు అంటగడుతున్నారు. దిగుబడి మాత్రం టన్నున్నర కూడా రావడం లేదు. పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిబంధనల ప్రకారం కంపెనీలు అందించిన సీడ్స్ దిగుబడి రాకపోతే రైతులను ఆయా కంపెనీలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాల్సి ఉంటుంది. కంపెనీలు మాత్రం రైతులకు ఏ మాత్రమూ అండగా నిలబడడం లేదు. దీనికి ప్రధాన కారణం మొక్కజొన్న కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాయకపోవడమే. రైతులకు సీడ్స్ అందించే కంపెనీలు అగ్రిమెంట్లు రాయాల్సి ఉంటుంది. జిల్లాలో ఎక్కడా అలా జరగడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. మొక్కజొన్న కంపెనీలు తమ మండలాల్లో ఎన్ని ఎకరాల సాగుకు సీడ్స్ అందించాయో కూడా మండల వ్యవసాయాధికారుల వద్ద సమాచారం ఉండడం లేదు. నష్టపోయిన రైతులు వ్యవసాయధికారుల వద్దకు వెళితే తాము ఏమీ చేయలేమన్నట్లు చేతులెత్తేస్తున్నారు. రైతు సంఘాలు, సిపిఎం రైతుల తరపున పోరాడి కొంతమేర న్యాయం చేయగలుగుతున్నాయి.

రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

మొక్కజొన్న సీడ్స్ సాగు చేసే రైతులకు అగ్రిమెంట్లపై అవగాహన కల్పించడంలో వ్యవసాయధికారులు విఫలమవుతున్నారు. ముందుగానే మొక్కజొన్న సాగుచేసే రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సి ఉన్నా సరిగ్గా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అగ్రిమెంట్లు లేకుండా సీడ్స్ అందించేందుకు వీల్లేకుండా కంపెనీలపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అటువంటి చర్యలు జరగడం లేదు. దీంతో మొక్కజొన్న కంపెనీలు తాము ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఆగస్టు 18న కలెక్టరేట్‌లో జరిగిన డిఆర్‌సి సమావేశంలో మొక్కజొన్న కంపెనీల తీరుపై ఎంఎల్‌ఎలు గళం విప్పారు. అగ్రిమెంట్లు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఏడాది అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ఈ ఏడాదైనా అగ్రిమెంట్లు రాసేవిధంగా చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సి ఉంది.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహించిన ఉత్తమ కార్యక్రమాలను రాష్ట్రస్థాయి అవార్డు కోసం సిఫార్సు చేయనున్నామని, జిల్లాలోని అన్ని శాఖల అధికారులూ చేపట్టిన కార్యక్రమాల్లో అత్యుత్తమ కార్యక్రమానికి సంబంధించి వివరాలు, ఫొటోలతో సహా వెంటనే పంపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమాలపై శుక్రవారం అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించి జిఎస్‌టి తగ్గింపు ద్వారా ప్రజలకు కలిగే లబ్ధిని అవగాహనా కార్యక్రమాల ద్వారా తెలియజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖలతో ట్రాక్టర్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై జిఎస్‌టి తగ్గింపుపై పెద్దఎత్తున రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ట్రాక్టర్లతో ర్యాలీలు, జిఎస్‌టి ఫలాల గురించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా ప్రచారం, పాఠశాల, కళాశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, పోటీలు, షాపింగ్ మేళాలు, ఎగ్జిబిషన్ కం సేల్, ఎంఎస్‌ఎంఇలతో పరిశ్రమలకు లభించే లబ్ధిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తాము నిర్వహించిన కార్యక్రమాల్లో అత్యుత్తమ కార్యక్రమానికి సంబంధించి వివరాలు, ఫొటోలను రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం నామినేట్ చేయడం జరుగుతుందన్నారు. దేశ ప్రధాని పర్యటనలో ఏర్పాటుచేసే ఫొటో ఎగ్జిబిషన్‌లో జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలకు చోటు లభించవచ్చన్నారు. దీనికిగాను గ్రామ అభివృద్ధి ప్రణాళికలను వెంటనే రూపొందించి సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నాగార్జునరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల సమస్యను పరిష్కరించాలి

గోతుల్లో మొక్కలు నాటి వినూత్న రీతిలో నిరసన



గోతిలో కొబ్బరి మొక్క నాటి నిరసన తెలుపుతున్న స్థానికులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పల రాజుగూడెం ప్రధాన సెంటర్లో అధ్వాన్నంగా ఉన్న రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంఘం నేతలు గోతుల్లో కొబ్బరి, అరటి మొక్కలు నాటి వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో ప్రధాన రహదారులన్నీ నరకదారులుగా మారాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభల సందర్భంగా అప్పలరాజుగూడెంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అప్పలరాజు గూడెం ప్రధాన కూడలిలోని గోతులు ప్రమాదకరంగా ఉన్నాయని, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రమాదకరంగా గోతులున్న కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించాలని రోడ్లు అభివృద్ధి చేసి సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో టి.నరసాపురంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యకాస మండల కార్యదర్శి బొడ్డపాటి రాజు, మండల నాయకులు రాజీవ్, గాంధీ, బొద్దుల గంగాభవాని, చెల్లమ్మ, రామలక్ష్మి, మడకం కుమారి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు వర్క్ ఔట్‌సోర్సింగ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



పెదబాబుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య పనులకు వర్క్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని ప్రయోగాత్మంగా అమలు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జాన్‌బాబు కోరారు. శుక్రవారం సిఐటియు ప్రతినిధి బృందం ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌ను, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్, జాన్‌బాబు మాట్లాడుతూ కార్మికులకు రక్షణ లేని, హక్కులు లేని వర్క్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే నెల్లూరు కార్పొరేషన్‌లో ప్రయోగాత్మంగా ప్రవేశపెట్టినపుడు సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాడి ఆ విధానాన్ని నిలుపుదల చేసిందని తెలియజేశారు. బేషరతుగా ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎల్‌ఎ తక్షణం జోక్యం చేసుకొని ఈ విధానాన్ని అమలు చేయకుండా చూడాలని కోరారు. నెల్లూరు కార్పొరేషన్ కార్మికుల పోరాట స్ఫూర్తితో ఏలూరులో వర్క్ అవుట్ సోర్సింగ్ విధానానికి వ్యతిరేకంగా పోరాటానికి దిగుతామన్నారు. సిఐటియు ప్రతినిధి బృందంలో ఎం.ఇస్సాక్, జె.గోపి, పంపన రవికుమార్, అమర్ కుమార్ ఉన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

వ్యకాస మండల మహాసభలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి




వ్యకాస మండల మహాసభలో మాట్లాడుతున్న ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. పట్టెన్నపాలెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం 12వ మండల మహాసభ శుక్రవారం నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను కమిటీ సభ్యురాలు పూసం దుర్గ ఎగురవేశారు. మండల మహాసభకు జోడే సూర్యచంద్రరావు అధ్యక్షత వహించగా ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య, కరువుల వెంకటలక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎ.రవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉప అధ్యక్షురాలు తామ ముత్యాలమ్మ, జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం పాల్గొని మాట్లాడారు. సంపద సృష్టికర్తలైన వ్యవసాయ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టం తీసుకొచ్చి వారికి సకల సౌకర్యాలు కల్పించాలని, సుప్రీంకోర్టు జిఒ ప్రకారం కూలి రూ.800 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రకాలువ ప్రాజెక్టు మిగులు భూముల్లో పోరాటాలు నిర్వహించి వందలాది ఎకరాలు పేదలకు సాగుకు అప్పగించిన ఘనత వ్యవసాయ కార్మిక సంఘానికి దక్కుతుందన్నారు. పంగిడిగూడెం, కేతవరం, గురవాయిగూడెం, మైసన్నగూడెం, పట్టెనపాలెం గ్రామాల్లో భూ పోరాటాలు నిర్వహిస్తుందని, తద్వారా పేదలకు భూములు అప్పగించిందని చెప్పారు. మూడేళ్ల కాలంలో మండలంలోని వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై పనిచేసి వారికి అండగా ఉన్నామన్నారు. అర్హులైన కుటుంబాలకి మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి రూ.పది లక్షలతో నిర్మాణం చేపట్టాలని, ఆ రకంగా సంఘం పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. గ్రామాల్లో రోడ్లు, డ్రయినేజీ, తాగునీరు, వీధిలైట్లు, శ్మశాన సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, పరిష్కారం కోసం ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌కు వినతపత్రం ఇచ్చినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. పోరాటాల ద్వారా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, 200 రోజులు పనులు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని, అడిగిన ప్రతి కుటుంబానికి జాబ్ కార్డులు ఇచ్చి పనులు కల్పించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం కృషి చేస్తుందని చెప్పారు. రానున్న మూడేళ్ల కాలంలో మండలంలోని పేదలందరికీ భూములు పంచాలని, కూలి రేట్లు పెంచాలని, ఉపాధి కల్పించాలని, లేకుంటే నిరుద్యోగ భృతి వ్యవసాయ కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు నిర్వహించి కూలీలకు అండగా ఉంటుందని, ఈ పోరాటాలకు వ్యవసాయ కార్మికులంతా పెద్ద ఎత్తున సన్నద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో యాగంటి సీత, అందుగుల ప్రభాకరరావు, ఎం.బాలరాజు, కె.సుబ్బారావు, వి.నరసరావు, ఎర్రమల కృష్ణ, బొక్క వెంకటేష్, ఎం.కుమారి, గోసాల మరియమ్మ, మడివి వెంకటలక్ష్మి, ఎన్.నాగరాజు, పిల్లి పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు

ఎంఇఒ-2కు ఫ్యాప్టో నాయకుల వినతి



వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి - దెందులూరు

బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో సంఘ నాయకులు పరసా నాగార్జున కోరారు. ఈ నెల పదో తేదీ నుంచి ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమం బహిష్కరించడం గురించి పెదవేగి ఎంఇఒ-2 అరుణ్‌కుమార్‌కు పెదవేగి మండల సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పరసా నాగార్జున మాట్లాడుతూ ఈ బోధనేతర కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయుల బోధన కుంటు పడుతుందన్నారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం పనరాలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తేరా ప్రభాకర్, పి.రమేష్, జి.కృష్ణ, ఎన్.ప్రవీణ్‌కుమార్, కె.శ్రీనివాసరావు, టి.ప్రవీణ్‌కుమార్, గుప్తా, విద్యాసాగర్, వి.అమృత్, ధనకాంత, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఐద్వా రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు



జంగారెడ్డిగూడెంలో...

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి పిలుపునిచ్చారు. పరింపూడి పంచాయతీ చాపలవీధిలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో గేదెల నాగులు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామలరాణి మాట్లాడుతూ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరవనున్నారని, 13వ తేదీన భారీ బహిరంగ సభ కూడా నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సభలో గత మూడేళ్ల కాలంలో జరిగిన ఉద్యమ అనుభవాలను పంచుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించనున్నారని తెలిపారు. జి.నాగులు ఐద్వా జెండాను ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు ఎస్.రాంబాబు మాట్లాడుతూ మహిళా సమస్యలపై నిరంతరంగా పనిచేసే సంస్థ ఐద్వా అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.సూర్యకుమారి, ఎ.వెంకటలక్ష్మి, ఎం.పుష్ప, కె.లక్ష్మి, కె.సత్యవతి, జి.లక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజాసంఘాల కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనంతపురంలో జరిగే సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వై.సీత, మానుకొండ కుమారి, గోసాల మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రతి ఒక్కరూ న్యాయపరమైన హక్కులు కలిగి ఉన్నారని, వాటిని వినియోగించుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వివిఎన్‌వి.లక్ష్మి సూచించారు. ముదినేపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలను రూపుమాపాలని కోరారు. మహిళలపై దాడులను అరికట్టడానికి న్యాయస్థానం ముందుంటుందన్నారు. ఎటువంటి సమస్యలైనా భయపడకుండా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ప్రజా సేవలకే పోలీస్ స్టేషన్లు ఉన్నాయన్నారు. మహిళలు స్వయం ఉపాధికి పెట్టే పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్స్ పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, ముదినేపల్లి మెడికల్ ఆఫీసర్ శాంతిశ్రీ పాల్గొన్నారు.

వేగంగా పోలవరం ప్రాజెక్టు పనులు

సందర్శించిన ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు



పనులు పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో జరుగుతున్న పనుల పురోగతిని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్టు పనుల అమలుపై సంబంధిత అధికారుల నుంచి వివరణాత్మక సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మీయ స్వప్నమన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి కీలకమైందన్నారు. ప్రాజెక్టు పనులు వేగంగా, నాణ్యతతో సాగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తోందని, ప్రజలకు త్వరలోనే ప్రాజెక్టు లాభాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రాజెక్టు పనుల నాణ్యత, వేగం, సాంకేతిక అంశాలపై ఎంఎల్‌ఎ పలు సూచనలు చేశారు. అవసరమైన చోట్ల తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, మెగా ఇంజినీరింగ్ అధికారులు, ఎస్ఐ పవన్ కుమార్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న కల్తీ మద్యం

వైసిపి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యాన నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ మద్యం ఏరులై పారుతుందనీ, వెంటనే నిషేధించాలని కోరుతూ వైసిపి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక న్యూ అశోక్ నగర్‌లోని జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సిఎం డౌన్ డౌన్, కల్తీ మద్యం నిషేధించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు కీసరి సరితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కల్తీ మద్యం తాగి ఎందరో ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఈ నెల తొమ్మిదో తేదీన ఏలూరు నగరంలో వైన్ షాపు వద్ద యువకుడు మద్యం తాగి మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. నకిలీ మద్యం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రస్తుతం గ్రామ గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ, కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కల్తీ మద్యాన్ని నిరోధించి ప్రజల ప్రాణాలను రక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు జుజ్జువరపు విజయనిర్మల, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



బాలిక ఆకృతిలో విద్యార్థులు

బాలికలు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు చెప్పారు. లక్ష్మీపురం ఎంపియుపి, ములగలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం బాలికలతో బాలిక ఆకృతి వేయించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాజు, రాంబాబు, పార్వతి, మురళి, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌కు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గవరవరంలో స్కూల్ బస్సు ఢీకొని బాలుడు మృతి చెందిన విషాద ఘటన స్థానికులను కలచివేసింది. సాయిరాకేష్ స్కూలులో ఎల్‌కెజీ చదువుతున్న ఎ.రిత్విక్‌సాయి (4)ని అదే స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టడంతో గాయాలపాలైన బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రమాద సమయంలో డ్రైవర్ అందుగుల ఆదిత్య వర్ధన్ నిర్లక్ష్యంగా బస్సు నడిపినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై బాలుడి తండ్రి ఎ.నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనపై స్పందించిన విద్యాశాఖాధికారులు సంబంధిత స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

బయ్యనగూడెంలో రచ్చబండ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యనగూడెం గ్రామంలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొని గ్రామ ప్రజలతో మాట్లాడారు. కోటి సంతకాల ఉద్యమం, అభివృద్ధి గురించి ముఖ్యంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంతెన సోమరాజు, ఎంపిపి గంజిమాల రామారావు, పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

ప్రజాశక్తి - దెందులూరు

అర్హులందరికీ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలు ఎలాంటి వివక్ష లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నామని, త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరుతో పాటు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేసి వారి సొంత ఇంటి కలలను సాకారం చేయటానికి చర్యలు చేపట్టామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు ఎంఎల్ఎ చింతమనేనిని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రికలను, పుష్ప గుచ్ఛాలను అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంఎల్ఎ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు హర్షణీయం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రోడ్ల నిర్మాణం కోసం రూ.వెయ్యి కోట్లను సిఎం చంద్రబాబు విడుదల చేయడం హర్షణీయమని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఏలూరులోని జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణం కోసం రూ.వెయ్యి కోట్లను, సుమారు రూ.ఐదు కోట్లతో నేషనల్ హైవేను అనుసంధానం చేసినందుకు సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘంటా ప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు

ప్రజాశక్తి - ముసునూరు

చిన్న (బాల్యం) వయసులో వివాహం చేస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు సచివాలయంలో మండలంలోని 16 గ్రామాల అంగన్వాడీ ఉపాధ్యాయ సిబ్బందితో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల అనేక అనర్థాలు వస్తాయన్నారు. తల్లిదండ్రులకు బాల్య వివాహం చేయడం వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తు తెలియని కారణాలతో వ్యక్తి స్నానాల గదిలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఏలూరు మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని శనగపప్పుపేట ఇందిరా కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న ఎర్ర వెంకటేశ్వరరావు (48) స్థానికంగా ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఇంజినీరింగ్ చదువుతుండడంతో గత తొమ్మిది నెలలుగా భీమవరంలోని భార్య, కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చే రూ.15 వేలు తీసుకునేందుకు వెంకటేశ్వరరావు ఏలూరు నగరానికి వచ్చాడు. అప్పటినుంచి ఇక్కడే ఉంటున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కాని శుక్రవారం మధ్యాహ్నం అతను ఇంటి వద్దనే ఇంట్లో ఉన్న స్నానాల గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. త్రీ టౌన్ సిఐ కోటేశ్వరరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కలిసి మండలంలోని ఎర్రగుంటపల్లిలో దాడి చేశారు. చవటపల్లి మరియమ్మ వద్ద నుంచి రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ సిఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు మద్యం షాపులను, ఒక రెస్టారెంట్, బార్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

బంగారు ఆభరణాలు చోరీపై టి.నరసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెడ్లం పంచాయతీలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన పంతగాని నాగరాజు తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల ఏడో తేదీ ఉదయం తన కుమారుడిని పాలకొల్లు నరసాపురంలోని హాస్టల్‌కు తీసుకెళ్లి అదే రోజు సాయంత్రం తిరిగి వచ్చి ఇంటికి వెళ్లకుండా తన తల్లి ఇంటికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నాడు. మరుసటి రోజు ఉదయం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగుల కొట్టి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. దీంతో నాగరాజు పోలీసులకు ఫిర్యాదుతో చేయడంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రక్కు చోరీపై కేసు

టి.నరసాపురం : ట్రాక్టర్ ట్రక్కు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం జయబాబు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన బొల్లిన నాగ భూషణం ఈ నెల తొమ్మిదో తేదీన గ్రామ శివార్లలో ఉన్న తన పామాయిల్ తోట వద్ద సాయంత్రం ట్రక్కు పెట్టి ఇంటికి వెళ్లి ఉదయం పొలం వెళ్లి చూడగా ట్రక్కును గుర్తు తెలియని దొంగలు అపహరించినట్లు గుర్తించాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో నాగభూషణం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలు నివారిస్తామని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణపై ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : జంగారెడ్డిగూడెం డివిజన్‌లో శాంతి భద్రతల పరిస్థితి ఎలా ఉంది?

డిఎస్‌పి : మా పరిధిలో శాంతి భద్రతలు కచ్చితంగా నియంత్రణలో ఉన్నాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకూ పెట్రోలింగ్ బలపరిచాం. ఎక్కడైనా చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించేలా ప్రత్యేక టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయి. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు క్రైమ్ రేట్ చాలా తగ్గింది.

ప్రశ్న : మీ డివిజన్లో అన్ని పోలీస్ స్టేషన్లో రిసెప్షన్ కౌంటర్లు పెట్టారా?

డిఎస్‌పి : మా డివిజన్‌లో ప్రతి పోలీస్ స్టేషన్‌లో కూడా ప్రజల వినతులు స్వీకరించడానికి రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటు చేశాము.

ప్రశ్న : మీ డివిజన్లో ఉన్న రౌడీ షీటర్లకు మీరిచ్చే సందేశం ఏమిటి?

డిఎస్‌పి : వారందరికీ నేను చెప్పదలచింది ఒకటే.. నేర చరిత్ర కలిగిన ఎవరైనా సరే కొత్తగా ఎటువంటి నేరానికైనా పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటాం. దానిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కూడా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నా.

ప్రశ్న : మద్యం, గంజాయి రవాణా లాంటి అక్రమ కార్యకలాపాలను ఎలా అరికడుతున్నారు?

డిఎస్‌పి : రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రహస్య సమాచారంపై ప్రత్యేక దాడులు చేస్తుంటాం. గత కొద్దికాలంలోనే అనేక కేసుల్లో నిందితులను పట్టుకున్నాం. ప్రజల సహకారం కూడా ఈ విషయంలో కీలకం.



ప్రశ్న : యువతలో పెరుగుతున్న రోడ్ యాక్సిడెంట్స్, ట్రాఫిక్ సమస్యలు ఎలా నియంత్రిస్తున్నారు?

డిఎస్‌సి : హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి అని కఠినంగా అమలు చేస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడపకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. స్కూలు, కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతీ వాహనదారున్ని కోరుతున్నాం. మైనర్‌లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులను నమోదు చేస్తాం.

ప్రశ్న : మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలు ఏవి?

డిఎస్‌పి : ప్రతీ పోలీస్ స్టేషన్‌లో మహిళా హెల్ప్ డెస్క్ ఉంది. 24 గంటల హెల్ప్‌లైన్ నడుస్తోంది. ఈవ్ టీజింగ్, వేధింపుల కేసుల్లో తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక పెట్రోలింగ్ జట్లు కూడా రాత్రివేళల్లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయి.

ప్రశ్న : ప్రజలకు మీరు చెప్పదలచుకున్న సందేశం ఏమిటి?

డిఎస్‌పి : పోలీసులపై నమ్మకం ఉంచండి. ఏ చిన్న సమస్యైనా వెంటనే మాకు తెలపండి. ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు కాపాడగలం. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి, చట్టాలను గౌరవించాలి. యువతకు చెప్పదలచుకున్న దొకటే ఒక్కసారి పోలీస్ రికార్డుల్లోకి ఎవరు పేరైనా నమోదైతే వాళ్లు మరణించే వరకు కూడా పోలీస్ రికార్డ్సులో వాళ్ల పేరు అలాగే ఉంటుంది. చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం, ఇతర దేశాలు వెళ్లాలన్నా పాస్‌పోర్ట్ రాదు, ప్రభుత్వ ఉద్యోగాలు రావు. అవి దృష్టిలో ఉంచుకొని యువత చెడు మార్గంలో వెళ్లొద్దని కోరుకుంటున్నాము.

ప్రశ్న : పోలీసులకు, ప్రజలకు మధ్య అనుసంధానం కోసం ఏమైనా ప్రత్యేక కార్యక్రమాలు(ఫ్రెండ్లీ పోలీస్) చేస్తున్నారా?

డిఎస్‌పి : ప్రజల కోసం మేము అవగాహన కార్యక్రమాలు చాలా చేపడుతున్నాము. స్కూలు, కాలేజీలు అలాగే లీగల్ సెల్‌లో ప్రత్యేక కార్యక్రమాలు చేసి వారికి దిశానిర్దేశం చేస్తున్నాం. అలాగే అందరికీ నా విన్నపం.. గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోగలిగితే నేరాలకు పాల్పడేవారు కొంతమేర తగ్గుతారు. క్రైమ్ రేట్ కూడా ఇంకా బాగా తగ్గుతుంది. సీసీ కెమెరాలు ఉండటం వల్ల ప్రజలకి ఎంతో మేలు జరుగుతుందని తెలియజేస్తున్నాము.

మంత్రి సొంత నగదుతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తమ సొంత నగదు రూ.2.40 లక్షలు వెచ్చించి ఎన్నో ఏళ్లుగా ఎదురుసుస్తున్న రోడ్డు నిర్మించి సిద్దార్థ నగర్ నర్సుపేట కాలనీ వాసుల కళ్లలో ఆనందాన్ని నింపారు. గత కొన్ని వారాల క్రితం మంత్రి సిద్దార్థ నగర్లో పర్యటించగా గ్రామస్తుల సమస్యలు తెలుసుకొని కొన్ని తక్షణమే పరిష్కరించి రోడ్డు సమస్య త్వరలో తీరుస్తానని హామీ ఇచ్చారు. మంత్రి తక్షణమే స్పందించి అధికారులను వివరాలు అడుగగా సుమారు. రూ.2.40 లక్షలు అంచనా అవుతుందని తెలపగా మంత్రి తమ సొంత నగదుతో బిటి రోడ్డు యుద్ధప్రాతిపదికన ప్రారంభించి పూర్తి చేశారు. నర్సుపేట కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రెజ్లింగ్ జిల్లా స్థాయి ఎంపికలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెజ్లింగ్ జిల్లా స్థాయి ఎంపికలు స్థానిక ఇండోర్ స్టేడియం మైదానంలో శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేట్ యాజమాన్యాల నుంచి సుమారు 200 మంది బాల బాలికలు ఈ పోటీలో పాల్గొన్నారు. 14 సంవత్సరాలలోపు, 17 సంవత్సరాలలోపు బాల బాలికలకు విడివిడిగా ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను వచ్చే నెలలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ, రాష్ట్ర పరిశీలకులు సిహెచ్.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణారావు, గురుమూర్తి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో స్వచ్ఛ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత, యువనేత పెండ్యాల అభిషేక్ బాబు ఆర్థిక సహాయంతో శుక్రవారం దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేశారు. గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజల శ్రేయస్సు కోరిన ఆయన మలాథియాన్ పిచికారీ చేయించారు. దీంతో పలువురు అభిషేక్ బాబును అభినందించారు. గత కొంతకాలంగా స్వచ్ఛ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అభిషేక్ బాబు పంచాయతీలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగనున్నట్లు ఆయన తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దెందులూరు : పెదవేగి మండలం పెదవేగి గ్రామానికి చెందిన ఏనుగు శ్యామలకు మంజూరైన రూ.1,23,305 సిఎంఆర్ఎఫ్ చెక్కును దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ఉదయం పెదవేగిలోని బాధితురాలి ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా చెక్కును అందుకున్న లబ్ధిదారురాలు ఎంఎల్ఎకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదవేగి సొసైటీ ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి తాతా సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా చేయాలి

ముదినేపల్లి : ఉపాధి హామీ చట్టంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా సామాజిక తనిఖీ చేయాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని 32 పంచాయతీల్లో ఏ పంచాయతీలో అయినా అవినీతి జరిగితే పార్టీలకు అతీతంగా అందరూ సహకరించి రికవరీ చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట పనులకు సంబంధించి సూచిక బోర్డులు కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడీ సుబ్బారావు, డ్వామా ఏపీడీ విక్టర్, ఎఫ్ఎం రాజశేఖర్, డిపిఒ అనురాధ, విజిలెన్స్ అధికారులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక తనిఖీ బృందంతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ మెంటల్ హెల్త్ డే

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని గవర్నమెంట్ హాస్పటల్లో ప్రపంచ మెంటల్ హెల్త్ డేపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అనూష హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక సమస్యలు ఉన్నవారు కూడా మానసిక వైద్యుడిని సంప్రదించి తగిన సలహాలు తీసుకుని మందులు వాడాలని సూచించారు. మానసిక వైద్య నిపుణులు కోమలి మాట్లాడుతూ మానసికంగా ఇబ్బందికి గురవుతున్నవారు ప్రతి సోమవారం నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చూస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ పద్మజ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో రహదారి అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆర్అండ్‌బి డిఇ హరికృష్ణ తెలిపారు. బయ్యనగూడెం నుంచి రెగులగుంట, దిప్పకాయలపాడు వరకు సుమారు పది కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.మూడు కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అలాగే కన్నాయగూడెం నుంచి పొంగుటూరు రహదారి అభివృద్ధి కోసం రూ.కోటి మంజూరు చేశారని తెలిపారు. అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ప్లాంటేషన్‌లో చోరీ చేస్తే చర్యలు

ప్లాంట్ మేనేజర్ వసంత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ఎపిఎఫ్‌డిసి కార్పొరేషన్ పరిధిలో జామాయిల్ బాదులను అక్రమంగా నరికి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం జోన్ ప్లాంట్ మేనేజర్ వసంత కుమారి హెచ్చరించారు. శుక్రవారం జీలుగుమిల్లి ప్లాంటేషన్ పరిధిలో 2006, 2013 సంవత్సరాల్లో సుమారు 56 హెక్టార్లలో నాటిన జామాయిల్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్‌లో అక్కడక్కడ జామాయిల్‌ను నరికి చెల్ల చెదురుగా పడేసిన చెట్లను గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో జామాయిల్ బాదులను అక్రమంగా నరికి తరలించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో పాటు డిప్యూటీ ప్లాంట్ మేనేజర్ రెహమాన్, సిబ్బంది ఉన్నారు.

పిహెచ్‌సి డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పిహెచ్‌సిల్లో పని చేస్తున్న రెగ్యులర్ డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, డాక్టర్లతో చర్చలు జరిపి సమ్మె విరమింపచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పిహెచ్‌సిల్లో పని చేస్తున్న దాదాపు 2,800 మంది డాక్టర్లు వారం రోజులుగా తమ సమస్యల పరిష్కరించమని కోరుతూ సమ్మె నిర్వహిస్తున్నారని, గత నాలుగు రోజులుగా విజయవాడలో దీక్షలు చేస్తున్నారని తెలిపారు. వీరి సమ్మె వల్ల పేదలకు వైద్య సేవలు దూరమయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఇన్ సర్వీస్ డాక్టర్లకు పేజీ సీట్లలో కేటాయించిన 30 శాతం సీట్లు కేటాయించాలని, ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఏజెన్సీ ఏరియాలో పనిచేస్తున్న వారికి ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలని, 104 సేవల్లో పనిచేస్తున్న డాక్టర్లకు అదనపు అలవెన్సులు చెల్లించాలని కోరుతూ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ప్రజా ప్రతినిధులతో చర్చించి వెంటనే సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల పరిషత్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ వస్తువులపై జిఎస్‌టి తగ్గింపు అంశంపై అవగాహనా సదస్సు ఐటిడిఎ పిఒ, ఎంపిడిఒ ఆధ్వర్యంలో నిర్వహించచారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, ప్రజలు, కార్యాలయ సిబ్బంది, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులపై జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం కళాశాల అర్థశాస్త్రం, వాణిజ్యశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద ర్యాలీని ప్రారంభించిన కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడారు. అనంతరం వన్ టౌన్ మెయిన్ బజార్లో ర్యాలీ నిర్వహిస్తూ స్థానికంగా ఉన్న దుకాణాల్లో కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్‌కుమార్, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకరరావు, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ సిబ్బంది, కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'తూర్పు కాపు యువత ఉన్నత స్థానాల్లో నిలవాలి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో తూర్పు కాపు, గాజుల కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పాలవలస యశస్వి, తూర్పు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు. శరత్ చంద్ర అకాడమీ అధినేత శరత్ చంద్ర విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అలాగే తూర్పు కాపు డైరెక్టర్లు లావేటి శ్రీనివాస్, కరణం పెద్దిరాజు, సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. పాలవలస యశస్వి మాట్లాడుతూ తూర్పు కాపు యువత ఉన్నత విద్యలో ముందంజలో ఉండేలా ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యతో పాటు ఆత్మవిశ్వాసం ఉంటే ఏ సమాజమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ చెన్నమళ్ల చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లా తూర్పు కాపు ప్రధాన కార్యదర్శి పిన్నింటి మహేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బలగం సేతు బంధన్ సీతారాం, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పలత, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర బాబు, పశ్చిమగోదావరి జిల్లా తూర్పు కాపు సంఘ కోశాధికారి బంకా ప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షులు నెరగాని అప్పారావు, ఏలూరు పట్టణ పరిరక్షణ కమిటీ వైస్ ఛైర్మన్ మజ్జి సూర్యకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఐఎఫ్‌టియు రాష్ట్రస్థాయి క్లాసులు

ఏలూరు అర్బన్ : నవంబర్ 1, 2, 3, 4 తేదీల్లో ఏలూరులో జరిగే ఐఎఫ్‌టియు రాష్ట్రస్థాయి క్లాసులను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అత్యవసర సమావేశం శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న యూనియన్ ఆఫీస్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మోడీషా సర్కార్ కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టిందన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్రంలో ఎనిమిది గంటల పని దినాలను కుదిస్తూ పది నుంచి 12 గంటలు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేసిందని చెప్పారు. కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేయాలనే ఉద్దేశంతో నవంబర్ 1, 2, 3, 4 తేదీల్లో ఐఎఫ్‌టియు రాష్ట్ర వ్యాప్తంగా క్లాసులు నిర్వహిస్తుందని, ఈ క్లాసులు కార్మిక వర్గ రక్షణ కోసం, సమరశీల ఉద్యమాలు ఏర్పాటుకు సన్నద్ధం కోసమని తెలిపారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

ముదినేపల్లి : జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా పోస్టల్ శాఖచే నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక ఆధార్ శిబిరంలో ఉచిత ఆధార్ నమోదుతో పాటు 5 నుంచి 7 సంవత్సరాల పిల్లలకు, 15 నుంచి 17 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్స్ తదితర అన్ని రకాల ఆధార్ సేవలు అందిస్తున్నామన్నారు. తదితర సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి హై స్కూల్ హెచ్ఎం వై.విజయ్‌కుమార్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.